సాక్షి
బాపట్ల
బుధవారం । 25 । అక్టోబర్ । 2023




## కొండవీడుపై సందడి

యడ్లపాడు: కొండవీడుకోట సందర్శకులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు పురాతన కట్టడాలను తిలకించి పులకించారు.



## దర్గాలో హైకోర్టు న్యాయమూర్తి

పెదకాకాని: దర్గాను హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్ దంపతులు మంగళవారం సందర్శించారు. దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 525.30 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## న్యూస్‌రీల్

### జయహో దుర్గాభవానీ





అమరావతి:దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీబాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో బాలచాముండేశ్వరి అమ్మవారిని మహిషాసురమర్దని దేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో తొమ్మిదో రోజు ఆశ్వీయుజ శుద్ధ నవమి శ్రవణా నక్షత్రం మహర్నవమి సందర్భంగా అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఆశ్వీయుజ శుద్ధ దశమిని పురస్కరించుకుని అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. చివరిరోజు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన పూజకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమి సందర్భంగా ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం సాయంత్రం 7 గంటలకు చండీ సమేత అమరేశ్వరస్వామికి పారువేట ఉత్సవం నిర్వహించారు. ఆలయంలోని రెండో ప్రాకారంలోని జమ్మిచెట్టు వద్ద శమీ పూజను ఆలయ అర్చకుడు కౌశిక చంద్రశేఖరశర్మ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

### భవిత కేంద్రాల రిసోర్స్ పర్సన్ పోస్టులకు స్కిల్‌టెస్ట్

గుంటూరు ఎడ్యుకేషన్ : సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లోని సహిత విద్య రిసోర్స్ పర్సన్ పోస్టులకు ప్రాథమికంగా అర్హులైన అభ్యర్థులకు బుధ, గురువారాల్లో స్కిల్ టెస్టు నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఆయా పోస్టులకు 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు వివరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎంఆర్ కేటగిరీ, గురువారం హియరింగ్, విజువల్లీ ఇంపేర్డ్ పోస్టుల అభ్యర్థులకు ఉదయం 9 గంటలకు గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్సీ హాల్లో స్కిల్ టెస్టు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### టీడీపీ నేతలపై కేసు నమోదు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): పోలీసు 30 యాక్ట్ అమలులో ఉండగా నిబంధనలకు విరుద్ధంగా ఆందోళన కార్యక్రమం చేపట్టి, సీఎం చిత్రపటం దహనానికి యత్నించిన టీడీపీ నేతలపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 23న టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఫెరోజ్, అజీజ్‌లతోపాటు, 15 మంది టీడీపీ కార్యకర్తలు ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఊరేగించి దహనం చేసేందుకు యత్నించారు. 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు టీడీపీ నేతలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ముగ్గురు ఎస్‌ఐలు, ఓ సీఐ సస్పెన్షన్

బాపట్లటౌన్: జిల్లాలో ఒక సీఐ, ముగ్గురు ఎస్‌ఐలను సస్పెండ్ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్టూరు సీఐ ఫిరోజ్, మార్టూరు ఎస్‌ఐ కె.కమలాకర్, పర్చూరు ఎస్‌ఐ ఎస్.సి.ప్రసాద్, యద్దనపూడి మాజీ ఎస్‌ఐ, ప్రస్తుతం డీసీఆర్‌బీలో ఉన్న హనోక్‌లను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన చర్యల్లో భాగంగా వీరిని సస్పెండ్ చేసినట్లు బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్ వివరించారు.

### విశ్రాంత ఉద్యోగులకు అందుబాటులో ఉంటా

గుంటూరు రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ విశ్రాంత ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. స్థానిక నల్లపాడు డీఆర్‌ఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను సోమవారం రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి కృషి చేసిన పెన్షనర్ల సలహాలు, సూచనలు ఎప్పుడూ తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ సెక్రటరీలు రాఘవబాబు, నారాయణరెడ్డి, అసోసియేషన్ ట్రెజరర్లు నరసింహారావు, సుధాకరరావు, రమేష్, ఎస్.ఎన్.సింగ్ తదితరులు పాల్గొన్నారు.



గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి నగరోత్సవం

కృష్ణానదిలో హంస వాహనంపై జలవిహారం చేస్తున్న ఆదిదంపతులు

## జలవిహారం..

దుర్గమ్మ కొలువుదీరిన ఇంద్రకీలాద్రి భక్తజనులతో పోటెత్తింది.. ఆదిదంపతుల జలవిహారంతో కృష్ణమ్మ పులకించింది. విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న హంస వాహనంపై, బాణసంచా వెలుగుల్లో గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వరస్వామి వార్ల తెప్పోత్సవం కృష్ణానదిలో కనుల పండువగా సాగింది. ఈ వేడుకను భక్తులు కనులారా తిలకించి పులకించారు. పూర్ణాహుతితో దేవీ శరన్నవరాత్రి వేడుకలు సోమవారం ముగిశాయి.

# నయనానందకరం..

- కనుల పండువగా ఆది దంపతుల తెప్పోత్సవం
- దుర్గామల్లేశ్వర స్వామి వార్ల రాకతో కృష్ణమ్మ పులకింత
- హంస వాహన సేవను కనులారా వీక్షించిన భక్తజనం
- పూర్ణాహుతితో ఘనంగా ముగిసిన శ్రీ దేవీ శరన్నవరాత్రులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ గంగ, పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించిన శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఇంద్రకీలాద్రిపై నిత్యం భక్తుల పూజలందుకునే ఆది దంపతులు సోమవారం సాయంత్రం హంస వాహనంపై కృష్ణానదిలో విహరించారు. మూడేళ్ల తర్వాత నిర్వహించిన తెప్పోత్సవంతో కృష్ణమ్మ పులకించింది. హంస వాహన సేవను కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులతో ప్రకాశం బ్యారేజీ, దుర్గఘాట్, దుర్గగుడి ఫ్లై ఓవర్, భవానీ ఘాట్ కిటకిటలాడాయి. తెప్పోత్సవంతో దసరా ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

**కనుల పండువగా నగరోత్సవ సేవ**

హంసవాహనంపై కృష్ణానదిలో విహరించేందుకు శ్రీ గంగ, పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్లు యాగశాల నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తజనుల కోలాట నృత్యాల మధ్య దుర్గాఘాట్‌కు ఊరేగింపుగా చేరుకున్నారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు, ఫెస్టివల్ ఆఫీసర్ ఆజాద్ ప్రత్యేక పూజలు చేసి నగరోత్సవాన్ని ప్రారంభించారు. దుర్గాఘాట్‌కు చేరుకున్న ఆదిదంపతులకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం హంస వాహనంపై త్రిలోక సంచారానికి గుర్తుగా మూడు పర్యాయాలు జలవిహారం చేయించారు. జైభవానీ.. జైజై భవానీ అంటూ భక్తులు చేసిన అమ్మవారి నామస్మరణతో కృష్ణా నదీతీరం మారుమోగింది. కృష్ణానదిలో హంసవాహన సేవ ప్రారంభమవగానే భవానీద్వీపం నుంచి భారీగా బాణసంచా కాల్చారు. సుమారు ముప్పావు గంట పాటు బాణసంచా వెలుగులతో కృష్ణానది తీరం సరికొత్త అందాలతో అలరించింది. ఈ వేడుకలో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దుర్గగుడి చైర్మన్ రాంబాబు, ఈఓ రామా రావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సీపీ టి.కె.రాణా, డీసీపీ విశాల్‌గున్ని, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, ఏసీపీ హనుమంత రావు, వన్‌టౌన్ సీఐ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి**

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించిన దసరా ఉత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఇంద్రకీలాద్రిపై యాగశాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు దంప తులు పాల్గొన్నారు. తొలుత ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో మహా పూర్ణాహుతిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం, ప్రసాదాల పంపిణీ జరిగింది. పూర్ణాహుతి అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అమ్మవారిని వివిధ అలంకారాల్లో తొమ్మిది లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని తెలిపారు.

## రెండు అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం



దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గమ్మ మహిషాసురమర్దని, శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారాల్లో భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాల చివరి రోజు కావడంతో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. సోమవారం తెల్లవారుజాము నుంచి మంగళవారం తెల్లవారుజాము ఒంటి గంట వరకు దర్శనాలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి అర్ధ గంట మాత్రమే అమ్మవారి ఆలయ ద్వారాలను మూసి ఉంచారు. సోమ, మంగళవారాల్లో రికార్డు స్థాయిలో నాలుగు లక్షల మందికి పైగా భక్తులు, భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేశారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. ఆ తరువాత శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించేందుకు రెండు గంటలపాటు దర్శనాలను నిలిపివేశారు. దీంతో వినాయకుడి గుడి వరకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. భవానీ మాలధారుల రద్దీ నేపథ్యంలో అర్ధరాత్రి రాత్రి 1.40 గంటల వరకు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. మంగళవారం కూడా అమ్మవారిని భక్తులు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శించుకున్నారు.



# వైభవంగా విజ్ఞాన్ స్నాతకోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వేదికపై కేంద్రమంత్రి సీతారామన్, విజ్ఞాన్ సంస్థల చైర్మన్ రత్తయ్య, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి చంద్రయాన్-3 నమూనాలను అందుకుంటున్న చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్, హెచ్‌ఎం, విద్యార్థులు

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరు
- గౌరవ డాక్టరేట్‌లు అందుకున్న పావులూరి సుబ్బారావు, ఎస్పీ వాసిరెడ్డి, కోనేరు హంపి

చేబ్రోలు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయని, వాటిని విద్యార్థులు ఒడిసి పట్టుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ప్లానింగ్, కమర్షియల్ ట్యాక్స్ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 11వ స్నాతకోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన ముగ్గురు ప్రముఖులకు కేంద్ర ఆర్థిక, రాష్ట్ర ఆర్థిక మంత్రులు, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్‌లు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ పావులూరి సుబ్బారావు, హైదరాబాద్‌లోని విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎస్పీ వాసిరెడ్డి, ఇండియన్ చెస్ ప్లేయర్ కోనేరు హంపిలకు విజ్ఞాన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లను చేసింది. 11వ స్నాతకోత్సవం సందర్భంగా మొత్తం 1,820 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 51 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు.

**చక్కని ప్రణాళిక కీలకం**

హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ పావులూరి సుబ్బారావు మాట్లాడుతూ ఎదగాలంటే చక్కని ప్రణాళిక ముఖ్యమన్నారు. జీవన నైపుణ్యాలను పెంచుకున్నవారే జీవితంలో విజేతలవుతారన్నారు.

**సవాళ్లను అధిగమించడం రేపటి తరం బాధ్యత**

హైదరాబాద్‌లోని విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎస్పీ వాసిరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పురోగతి నుంచి సామాజిక అసమానతలు వంటి అనేక గణనీయమైన సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందన్నారు. కరుణ, సానుభూతితో వీటిని పరిష్కరించడం రేపటి యువకుల బాధ్యతన్నారు.

**కష్టేఫలి**

ఇండియన్ చెస్ ప్లేయర్ కోనేరు హంపి మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా నిరంతరం కష్టపడుతూనే ఉండాలన్నారు. విజయం కోసం ఎదురు చూడకుండా మన ప్రయత్నం మనం చేస్తూ ఉంటే విజయం తనంతట తనే సొంతమవుతుందని వివరించారు.

**నిరంతరం అప్‌డేట్ కావాలి**

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ జనాభా పరంగా ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన యువతరం కలిగిన దేశం మనదని వివరించారు. నిరంతరం శ్రమిస్తూ అప్‌డేట్ అవుతుండాలని విద్యార్థులకు సూచించారు. సాహసాలకు వెనుకాడకూడదని, అప్పుడే గొప్ప విజయాలు సిద్ధిస్తాయని హితవు పలికారు.

**విద్య శక్తివంతమైన ఆయుధం**

విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని చెప్పారు. ఉజ్వల భవిష్యత్‌ను సృష్టించేందుకు, ప్రపంచాన్ని మార్చడానికి దోహదం చేస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుదల, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సరిహద్దులను నెట్టివేస్తోందన్నారు.

**అంబరాన్నంటిన సంబరం**

డిగ్రీలు చేతబట్టిన వేళ విద్యార్థుల సంబరం, కేరింతలు, అంబరాన్నంటాయి. నాలుగేళ్ల తమ అనుభవాలను విద్యార్థులు పంచుకున్నారు. విశ్వవిద్యాలయంతో పెంచుకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సెల్ఫీలు దిగారు. విద్యార్థులంతా తలపాగా, కండువా వేసుకుని అచ్చ తెలుగు పెద్ద మనుషుల్లా కనిపించారు. సంస్కృతీసంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఆయా విభాగాల డీన్లు తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల ఆయుధపూజ



ఆయుధ పూజలో పాల్గొన్న డీఎస్పీ టి.వెంకటేశులు, ఎస్‌బీ సీఐ సూర్యనారాయణ దంపతులు

బాపట్లటౌన్: చెడుపై మంచి విజయానికి చిహ్నమే విజయదశమి అని బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా ఏఆర్ కార్యాలయంలో బాపట్ల డీఎస్పీ, ఎస్‌బీ సీఐ సూర్యనారాయణ ఆయుధపూజ నిర్వహించారు. తొలుత పోలీసు ఆయుధాలకు, వాహనాలకు కుటుంబ సమేతంగా పూజలు చేశారు. డీఎస్పీ టి.వెంకటేశులు మాట్లాడుతూ ఆయుధ పూజ అనేది భద్రతా దళాలకు అత్యంత ముఖ్యమైన పండగని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది సఫలీకృతమవ్వాలని, జిల్లా పోలీసు శాఖ అన్ని విషయాల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏమ్‌డీహెచ్ ప్రేమ్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, హోంగార్డ్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై రాళ్ల దాడి

దాచేపల్లి: అమ్మవారి ఊరేగింపులో టీడీపీ నేతలు దాష్టీకానికి దిగారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలే లక్ష్యంగా రాళ్లదాడికి పాల్పడ్డారు. పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. వివరాలు.. దాచేపల్లి మండలం రామాపురంలో దసరా పండగ సందర్భంగా సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని వాహనం పెట్టి ఊరేగిస్తూ బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో టీడీపీ నేతల ఇళ్ల వద్దకు బతకమ్మ రావటంతో తమ ఇళ్ల వద్ద బాణసంచా కాల్చకుండా అమ్మవారిని తీసుకెళ్లాలని టీడీపీ నేతలు అడ్డగించారు. అంతటితో ఆగకుండా ఇక్కడ బాణసంచా కాల్చితే ఆరు నెలల్లో మా టీడీపీ ప్రభుత్వం వస్తుంది.. మీ అంతు చూస్తామంటూ టీడీపీ నేతలు వేముల వీరరాఘవరెడ్డి, ఆకూరి వెంకటరెడ్డి, వేముల నర్సిరెడ్డి, వేముల అచ్చిరెడ్డి, నాగిరెడ్డి అమరేశ్వరరెడ్డి, ఆకూరి శ్రీనివాసరెడ్డి, వేముల లింగమ్మ, వేముల వినోద్‌రెడ్డి, వేముల ప్రతాప్‌రెడ్డి, వేముల నర్సిరెడ్డితోపాటుగా మరి కొందరు బెదిరింపులకు దిగారు. అమ్మవారి విగ్రహాన్ని ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో టీడీపీ నేతలు ముదస్తు ప్రణాళికతో రాళ్లు, కర్రలు, కారంతో దాడులకు తెగబడ్డారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# సంక్షేమ రాజ్యానిదే విజయం

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

తెనాలి: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యాన్ని కొనసాగించాలన్నదే ప్రజల ఆకాంక్ష అని, అందరినీ చైతన్యవంతులను చేసి దీనిని సాకారం చేసేందుకే ఈనెల 26 నుంచి సామాజిక సాధికారిత బస్సు యాత్రను ప్రారంభిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. ఈనెల 26న తెనాలిలో ఆరంభం కానున్న బస్సు యాత్ర రూట్ మ్యాప్‌ను, బహిరంగ సభావేదిను స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అక్కడే విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించేందుకు ఉద్దేశించినదే బస్సు యాత్ర అని మాణిక్యవరప్రసాద్ చెప్పారు. యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

**విజయవంతం చేద్దాం**

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ తెనాలిలో ఈనెల 26న బస్సు యాత్రను ఆరంభించనున్నట్టు తెలిపారు. రూరల్ మండలం హాఫ్‌పేట నుంచి ప్రారంభమై కొలకలూరు, నందివెలుగు, కంచర్లపాలెం, కఠెవరం మీదుగా యాత్ర తెనాలి చేరుకుంటుందని వివరించారు. సాయంత్రం 5 గంటలకు పురవేదిక వద్ద భారీ బహిరంగసభ ఉంటుందని వివరించారు. నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు సమష్టిగా యాత్రను జయప్రదం చేద్దామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కార్పొరేషన్ల డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, పార్టీ నేతలు ధర్మరాజుల చెన్నకేశవులు, కుక్కల ముక్తేశ్వరరావు, కొమ్ము రాయల్, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, కాకి దేవసహాయం, కనపర్తి అబ్రహాం లింకన్, కఠెవరపు దేవానంద్, పేరం సంజీవరెడ్డి, శానంపూడి రఘురామిరెడ్డి, ప్రసాదం బాలగురవమ్మ, పినపాటి అనిల్, అక్కిదాసు కిరణ్, అత్తోట చంటి పాల్గొన్నారు.



తెనాలిలో జరిగే బస్సుయాత్ర బహిరంగ సభావేదికను ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నేతలతో కలిసి పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

## క్లుప్తంగా

### ఓపెన్ స్కూల్ దరఖాస్తు గడువు 31 వరకు పెంపు

**బాపట్ల అర్బన్:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్లో) 2023 -24 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు తెలిపారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, సమీపంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి, ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చు అన్నారు. పదో తరగతిలో ప్రవేశం పొందడానికి 2023 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. అడ్మిషన్ పొందుటకు రికార్డు షీట్ లేదా టీసీతో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఉండాలని చెప్పారు. ఇంటర్‌లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. టెన్త్ పాస్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు పొందుపరిచి అడ్మిషన్ పొందవచ్చునన్నారు.

### ఆంధ్రప్రదేశ్‌లో కుల గణనకు ముందడుగు

**తెనాలి:** ఆంధ్రప్రదేశ్‌లో కుల గణనకు రాష్ట్రప్రభుత్వం ముందడుగు వేసినట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వం గతంలో లోక్‌సభలో చేసిన ప్రకటన మేరకు కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ద్వంద్వ వైఖరిని తగదని స్పష్టం చేశారు. సంఘ రాష్ట్ర కార్యవర్గంతో కలిసి సోమవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వివరాలను మంగళవారం తెనాలిలో విలేకరుల సమావేశంలో తెలిపారు. సామాజిక న్యాయంలో కేంద్రప్రభుత్వ విద్యాలయాలు/ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఓబీసీలకు శాపంగా మారిన క్రిమిలేయర్‌ను తొలగించాలని, ఓబీసీలకు ఎస్సీ, ఎస్టీల తరహాలోనే ఉద్యోగాల్లో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేసినట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో ఓబీసీలకు దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషను బిల్లులో ఓబీసీ మహిళలకు 33 శాతం ఉపకోటాను కేటాయించాలని కోరినట్లు చెప్పారు.

# గుండెపోటుతో సైనికుడి మృతి

- 22న పూణేలో ఘటన..
- స్వగ్రామం గోకరాజు నల్లిబోయినవారి పాలెంలో అంత్యక్రియలు



జవాన్ భౌతిక కాయంపై జాతీయ జెండాను ఉంచి నివాళులర్పిస్తున్న దృశ్యం

**పిట్టలవానిపాలెం:** గుండెపోటుతో ఆర్మీలో సిపాయిగా విధులు నిర్వహిస్తున్న పిట్టలవానిపాలెం మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన పూణెలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పిట్టలవానిపాలెం మండలం గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామానికి చెందిన పులుగు బళ్లారెడ్డి - సాంబమ్మలకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు పులుగు ఉమామహేశ్వరరెడ్డి(35)గత 15 ఏళ్ల క్రితం ఆర్మీలో సిపాయిగా చేరాడు. వివిధ ప్రాంతాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ పూణేలో పనిచేస్తున్నాడు. గత కొన్నాళ్ల క్రితం పూణె నుంచి జమ్మూ కశ్మీర్‌కు డిప్యుటేషన్‌పై పంపించారు. అక్కడ విధులు నిర్వహిస్తుండగా భార్య, పిల్లలు పూణెలో నివసిస్తున్నారు. అయితే ఇటీవల పిట్టలవానిపాలెం మండలం గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామంలో నివసిస్తున్న వారి తండ్రి బళ్లారెడ్డి అనారోగ్యానికి గురై గుంటూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదేవిధంగా తల్లికి సైతం చెయ్యి విరిగిందని ఇంటివద్ద నుంచి సమాచారం అందింది. దీంతో తల్లిదండ్రులను చూడాలని సెలవుపై వచ్చి ఈనెల 22వ తేదీన పూణెలో నివసిస్తున్న భార్య, పిల్లల వద్దకు వచ్చి ఉదయాన్నే బయలుదేరి వెళదామని రాత్రి భోజనం చేసి నిద్రించాడు. తెల్లవారి నిద్ర లేపబోయేసరికి మృతిచెంది ఉన్నాడు. ఉమామహేశ్వరరెడ్డి భౌతికకాయాన్ని మంగళవారం ఉదయం స్వగ్రామానికి చేర్చారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు..**

సైనిక లాంఛనాలతో ఉమామహేశ్వరరెడ్డి అంత్యక్రియలను గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ షేక్ బాజి, మండల ఉపాధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు మండే విజయ్‌కుమార్, బాపట్ల టీడీపీ ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్ర వర్మ, గ్రామ సర్పంచ్ దబ్బకూటి మాధవరావు, చందోలు ఎస్ఐ రాజశేకర్‌లు ఉమామహేశ్వరరెడ్డి భౌతికకాయం వద్ద పూలదండలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర త్రివిధ దళాల సైనిక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస వరప్రసాదరావు, సభ్యులు షేక్ కాలేషా, ఖాదర్ మస్తాన్, కాటి ఆదాం, ప్రశాంత్‌కుమార్‌లు మృతుని ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. ఉమామహేశ్వరరెడ్డి భౌతిక కాయంపై జాతీయ జెండాను ఉంచి సెల్యూట్ చేశారు.

## పద్యనాటక కళాకారుడు ఆరాధ్యులకు గౌరవ డాక్టరేట్

- అమెరికాలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీచే ఎంపిక
- 28న పాండిచ్చేరిలో జరగనున్న స్నాతకోత్సవంలో బహూకరణ



ఆరాధ్యుల కోటేశ్వరరావు



శ్రీకృష్ణుడు పాత్రలో ...

**తెనాలి:** తెనాలికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు ఆరాధ్యుల కోటేశ్వరరావుకు అమెరికాలోని డెలావర్ స్టేట్‌లో గల గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ కేటగిరీలో ఎంపిక చేసిన ఈ గౌరవాన్ని ఈనెల 28న పాండిచ్చేరిలోని కంబన్ కలైరంగమ్ ఆడిటోరియమ్‌లో జరగనున్న యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ప్రదానం చేస్తారు. ఈ ప్రకారం యూనివర్సిటీ వ్యవస్థాపకుడు/ చైర్మన్ డాక్టర్ పి.మాన్యుయేల్ సమాచారం పంపారు.

తన పద్యగానంతో పౌరాణిక నాటకరంగాన్ని ప్రకాశింపజేసిన ఆణిముత్యాల్లో తెనాలికి చెందిన 'గానకోకిల' ఏవీ సుబ్బారావు ఒకరు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పాత్రలతో అర్ధశతాబ్దంపాటు నాటక ప్రియులను అలరించిన శిఖామణి ఆయన. ఆయన రెండో కుమారుడైన కోటేశ్వరరావు, తండ్రి, సోదరుల బాటలోనే పద్యనాటకానికి అంకితవుయ్యారు. విద్యార్థి దశనుంచి నాటకాభిలాషతో అయిదేళ్లు సాంఘిక నాటకాల్లో నటించారు. హార్మోనియం నేర్చుకుని, ప్రముఖ నటులకు హార్మోనిస్టుగా పనిచేశారు. 1979లో తొలిసారిగా శ్రీకృష్ణుడు పాత్రలో అరంగేట్రం చేశారు. 1984లో డిగ్రీ పూర్తయ్యాక, వృత్తి కళాకారుడిగా జీవితాన్ని ఆరంభించారు. ఈయన కూడా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, భవానీశంకరుడు, బుద్ధుడు, అనిరుద్ధుడు పాత్రలను పోషిస్తూ నాటకాభిమానులను గెలుచుకున్నారు. శ్రీవెంకట లక్ష్మీదుర్గ నాట్యమండలిని స్థాపించి, ఆ సమాజం ద్వారా నాటకాలను ప్రదర్శిస్తున్నారు. 1989లో ఒకసారి సినిమా రంగానికి వెళ్లినా, మళ్లీ రంగస్థలానికి తిరిగొచ్చారు. ఇప్పటికి 4,150 ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ముఖ్య పట్టణాలతోపాటు చెన్నై కళాసాగర్, ముంబయి ఆంధ్ర మహాసభ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లోనూ ప్రదర్శనలిచ్చారు. వందలాది సత్కారాలను అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాలశాఖ 1992లో నిర్వహించిన పద్యనాటక పోటీల్లో ప్రదర్శించిన 172 నాటకాల్లో వీరి ప్రదర్శన మొదటి బహుమతి గెలుచుకుంది. 2015, 2023లలో తానా ఆహ్వానంపై అమెరికా వెళ్లి వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనలిచ్చారు. 2017లో అమెరికాలోని తెలంగాణ తెలుగు అసోసియేషన్ ఆహ్వానంపైనా అక్కడకు వెళ్లారు. 2016లో డల్లాస్‌లో జరిగిన ఉత్సవాల్లో నాటా సాంస్కృతిక అవార్డును స్వీకరించారు. టీవీ ఆర్టిస్టుగా పలు సీరియళ్లలో నటించారు. శివాజీరాజా సంబరాల రాంబాబులో రాముడి వేషం కట్టారు. ఇప్పటికీ రంగస్థలంపై పద్యనాటక కళతో రాణిస్తున్నారు.

### 'హ్యూమన్ రైట్స్' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగయ్య



**గుంటూరు ఎడ్యుకేషన్:** నేషనల్ హ్యూమన్ రైట్స్ - సోషల్ జస్టిస్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్‌గా బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంకు చెందిన డాక్టర్ పయర్ల నాగయ్య నియమితులయ్యారు. ఈమేరకు కమిషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెహతాబ్ రాయ్ తనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు నాగయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో ప్రైవేటు ఉపాధ్యాయుడిగా 34 ఏళ్లుగా పని చేస్తున్న నాగయ్య సమైక్య ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్‌ను స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా న్యూఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ - సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమించింది. మానవ హక్కులు, బాలల హక్కుల పరిరక్షణతో పాటు అంటరానితనం, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన కమిషన్ ఏపీ అధ్యక్షుడు చిట్టిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

### పోరుమామిళ్ల చెరువులో తెనాలి విద్యార్థి మృతి

**పోరుమామిళ్ల:** సరదాగా చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థి మృత్యువాత పడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం.. మైదుకూరు గాంధీనగరానికి చెందిన కొండా సుమంత్‌రెడ్డి గుంటూరు విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అదే తరగతిలో చదువుతున్న తెనాలికి చెందిన మనోజ్‌రెడ్డి మంచి స్నేహితుడయ్యాడు. అతనితో కలసి తెనాలికి వెళ్లేవాడు. అక్కడ మనోజ్ మామ కొడుకు వసంత్ రెడ్డితో పరిచయం స్నేహంగా మారింది. మనోజ్, వసంత్‌లను దసరా సెలవులు ముగుస్తున్నందున సుమంత్ తన ఊరికి ఆహ్వానించాడు. సుమంత్ అవ్వగారి ఊరు తిరువెంగళాపురం. మనోజ్, వసంత్‌రెడ్డి ఆదివారం రాత్రి తెనాలి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం పోరుమామిళ్లలో బస్సు దిగి సుమంత్ రెడ్డి అవ్వగారి ఊరు తిరువెంగళాపురం వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేశాక నలుగురైదుగురు పిల్లలు సరదాగా చెరువులోకి ఈతకు వెళదామని బయలు దేరారు. వసంత్‌కు ఈత రాదు. చెరువులో దిగి గుంతలో చిక్కుకోవడం గమనించిన స్నేహితులు కేకలు వేసి, ఊర్లోవారిని పిలిచారు. వారు వచ్చి అతన్ని బయటకు తీసేసరికే నీళ్లల్లో ఊపిరి ఆడక వసంత్ రెడ్డి (17) మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని విచారించగా వసంత్ రెడ్డి తెనాలికి చెందిన భూపాల్‌రెడ్డి కుమారుడని, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు బయలుదేరి వస్తున్నారన్నారు. కేసు నమోదు చేసి విచారిస్తామన్నారు. ఇదిలా ఉండగా వసంత్ మృతితో భయపడిన సుమంత్ స్పృహ కోల్పోయాడు. అతన్ని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మనోజ్ కూడా భయంతో మాట్లాడలేని పరిస్థితి. భూపాల్‌రెడ్డికి వసంత్ ఒక్కడే కుమారుడు.

### ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

**గుంటూరు రూరల్:** అక్రమ సంబంధం నేపథ్యంలో భార్యపై భర్త దాడిచేసిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో చోటు చేసుకుంది. వట్టిచెరుకూరు పోలీసుల కథనం ప్రకారం పుల్లడిగుంటకి చెందిన సల్మాకు ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన సుబానితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడేళ్ల క్రితం ఇరువురు విడిపోయి ప్రస్తుతం సల్మా పుల్లడిగుంటలో నివసిస్తోంది. ఈ క్రమంలో సల్మాకు అమీనాబాద్‌కు చెందిన సాహిదుల్లా అనే వ్యక్తితో పరిచయమై వివాహేతర సంబంధంగా మారింది. సోమవారం సాయిదుల్లా, సల్మాలు నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటివద్ద ఉన్నారని తెలుసుకున్న భర్త సుబాని మరొక వ్యక్తితో కలిసి కత్తులతో దాడిచేశాడు. ఈ దాడిలో సాహిదుల్లా (40) అక్కడికక్కడే మృతి చెందగా సల్మాకు తీవ్రగాయాలయ్యాయి. ఇరువురు మృతి చెందారని భావించి సుబాని అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సల్మాను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వట్టిచెరుకూరు పోలీసులు తెలిపారు.

# మధురాతి మధురం..



గురువులతో కలసి దిగిన పూర్వవిద్యార్థుల ఫొటో

- 32 ఏళ్ల తర్వాత విద్యార్థుల కలయిక
- కారంచేడు ఉన్నత పాఠశాల వేదిక

**కారంచేడు:** ఏరా.. ఎలాగున్నావ్. ఏం చేస్తున్నావ్, ఎక్కడున్నావు.. మీ కుటుంబం బాగుందా అంటూ ఆత్మీయ పలకరింపులు. ఎప్పుడో చిన్నప్పుడు కలసి చదువుకున్న మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మండల కేంద్రమైన కారంచేడులో యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 1991 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 32 ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. దసరా సెలవులను పురస్కరించుకొని తాము చదివిన పాఠశాలలోను కలుసుకోవడానికి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే సోమవారం పాఠశాలలో చేరి వారు చిన్నప్పుడు చేసిన అల్లరి, పోటీలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను సత్కరించుకున్నారు. ఆత్మీయ విందు ఏర్పాటు చేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకొని మరలా వీడ్కోలు పలికారు.

# ఆలయ అర్చకుడి ఇంట్లో చోరీ

- 8 సవర్ల బంగారం, 250 గ్రాముల వెండి మాయం
- మరో ఆలయంలో హుండీ కానుకలు..



వెంకటరామాచార్యులు ఇంట్లో చోరీ చేసిన దుండగలు

**యద్దనపూడి:** దసరా పండుగ సందర్భంగా దొంగలు రెచ్చిపోయారు. సోమవారం మండల కేంద్రం యద్దనపూడిలో ఒక ఆలయంలో హుండీ, మరో ఆలయంలో పూజారి ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి వస్తువులు దొంగతనం చేశారు. యద్దనపూడిలోని వేణుగోపాలస్వామి ఆలయంలోని పూజారి పరుచూరి వెంకటరామాచార్యులు ఇంట్లో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డారు. గత కొంతకాలంగా వెంకటరామాచార్యులకు అనారోగ్యం ఉండటంతో హైదరాబాద్‌లో కుమార్తె వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి పూజారి ఇంటి తలుపులు పగులగొట్టి ఇంటిలోని ఎనిమిది సవర్ల బంగారం, 250 గ్రాముల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈమేరకు వెంకటరామాచార్యులు, కుమారుడు వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగశ్రీను తెలిపారు. మొత్తం రూ.2 లక్షల విలువ ఉంటుందని పూజారి తెలిపాడు.

**ఆలయంలో హుండీ చోరీ..**

మండల కేంద్రం యద్దనపూడిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు ఆలయంలోకి చొరబడి హుండీ పగులగొట్టి అందులోని సుమారు రూ.5 వేలు ఎత్తుకు వెళ్లారు. రోజూ మాదిరిగానే పూజా కైంకర్యాల కోసం ఆలయానికి వచ్చిన పూజారి హుండీ పగులకొట్టడం చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు.

## ఉత్తమ ప్రదర్శనగా 'వసంత రాజీయం'

- సాంఘిక నాటికల్లో విజేతగా 'రాత'
- ముగిసిన వీణా అవార్డ్స్-2023 పద్య నాటక/సాంఘిక నాటిక పోటీలు



వసంత రాజీయంకు రూ.లక్ష నగదు, బంగారు వీణ అందజేస్తున్న నిర్వాహకులు

**తెనాలి:** కళల కాణాచి- తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్- విజయవాడ సంయుక్త నిర్వహణలో స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఐదురోజులుగా నిర్వహిస్తున్న వీణా అవార్డ్స్-2023 తృతీయ జాతీయస్థాయి పద్యనాటక/సాంఘిక నాటికల పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. పద్యనాటక విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా శ్రీకళానికేతన్, హైదరాబాద్ వారి 'వసంత రాజీయం' బంగారు వీణ, రూ.లక్ష నగదు బహుమతిని గెలుచుకుంది. ఈ పద్యనాటకానికి దర్శకత్వం వహించిన మారంరాజు రామచంద్రరావు ఉత్తమ దర్శకత్వం బహుమతిని, నాటక రచయిత తడకమళ్ల రామచంద్రరావు ఉత్తమ రచన బహుమతిని గెలుచుకోవటం విశేషం. ఇదే నాటకానికి ఉత్తమ ఆహార్యం (పి.రమేష్), ఉత్తమ క్యారెక్టర్ నటి(సురభి వెంగమాంబ), జ్యూరీ బహుమతి(డాక్టర్ శ్రీజ సాదినేని) లభించాయి.


ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా జయకళానికేతన్, విశాఖపట్నం వారి 'శ్రీకాంత కృష్ణమాచార్య' రజత వీణ, రూ.75 వేల నగదును అందుకుంది. ఇదే పద్యనాటకానికి ఉత్తమ నటుడు(కె.వెంకటేశ్వరరావు), ఉత్తమ హాస్యనటుడు(ఎస్.డేవిడ్‌రాజు), ఉత్తమ సంగీతం (డి.మురళీధర్), ఉత్తమ రంగాలంకరణ(సురభి సంతోష్), ఉత్తమ రంగోద్దీపన(సురభి సంతోష్/ఫణి) బహుమతులు లభించాయి.

తృతీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీకుమారరామ భీమేశ్వర నాట్యమండలి, కాకినాడ వారి 'నర్తనశాల'కు రూ.50 వేలు నగదు, రజత వీణ దక్కాయి. శ్రీవినాయక నాటక కళామండలి, రేణిగుంట వారి 'మహారధి కర్ణ' నాటకంలో నటించిన వనారస విజయలక్ష్మికి ఉత్తమ నటి, కూకట్‌పల్లి, హైదరాబాద్ వారి శ్రీస్వామి అయ్యప్ప నాటికలో శివుడు పాత్రధారి బాబురాజు ఉత్తమ క్యారెక్టర్ నటుడు, చాగండి సాయిలక్ష్మికి ఉత్తమ ప్రతినాయకి అవార్డులు లభించాయి. మోహినీ భస్మాసురుడులో భస్మాసురుడి పాత్రధారి మొగిలిపువ్వు వెంకట సుబ్బయ్య, కారే రాజులు... రాజ్యముల్ కలుగవే... నాటకంలో పోతన పాత్రధారి చేగొండి సత్యనారాయణమూర్తికి జ్యూరీ బహుమతులు దక్కాయి.

**సాంఘిక నాటికల విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా 'రాత'**

సాంఘిక నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్- వెలగలేరు వారి 'రాత', బంగారు వీణ రూ.50 వేల నగదు బహుమతిని గెలుచుకుంది. చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా రజత వీణ, రూ.40 వేల నగదు, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి, ఉక్కునగరం, విశాఖపట్నం వారి 'ది గిఫ్ట్' నాటిక రూ.30 వేల నగదు, కాంస్య వీణను అందుకుంది. ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన రాత నాటికకు ఉత్తమ దర్శకత్వం (పోలురాజు శ్రీనివాస్), ఉత్తమ నటుడు (గోవర్ధన్), ఉత్తమ బాలనటి(సురభి వాగ్దేవి) బహుమతులు లభించాయి. ఉత్తమ నటిగా ఉష (స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ క్యారెక్టర్ నటి ఎస్.మాధవి (అమృతహస్తం), 'ది గిఫ్ట్' నాటికకు ఉత్తమ సంగీతం లీలామోహన్, ఉత్తమ రంగోద్దీపనం బహుమతులు లభించాయి. వీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్-ఇబ్రహీంపట్నం, విజయవాడ వారి ఎనిమి నాటికకు ఉత్తమ రచన(కవి పీఎస్ఎం), ఆహార్యం, జ్యూరీ బహుమతి దక్కాయి. నిర్వాహక సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ సాయి మాధవ్ బుర్రా, డాక్టర్ వరప్రసాద్, ఆర్ఎస్ఆర్ గ్రూప్స్ అధినేత శ్రీకాంత్‌రెడ్డి, సినీదర్శకులు వంశీ, నటుడు ప్రదీప్, సినీ నటుడు అశోక్ గల్లా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

## రేపు నండూరులో బజరంగ్ 'నేత్రజ్యోతి'



- జగన్నామ సంక్షేమ సంవత్సరంలో పేదల కోసం పలు కార్యక్రమాలు
- బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

**కొరిటిపాడు (గుంటూరు):** ఆరోగ్యవంతమైన జీవితం ప్రతి ఒక్కరికీ దక్కాలనే మానవీయ కోణంతో 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అన్న సూక్తి స్ఫూర్తిగా నేత్ర జ్యోతి పేరుతో బజరంగ్ ఫౌండేషన్ పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. రంగుల ప్రపంచాన్ని సాక్షాత్కారం చేసే కంటి చూపును తిరిగి పొందిన వారి కళ్లలో కనిపించే సంతృప్తి ముఖ్యమని, బజరంగ్ ఫౌండేషన్ 'నేత్ర జ్యోతి' కార్యక్రమంలో అంతర్లీనంగా ఉన్న భావోద్వేగం ఇదేనని స్పష్టం చేశారు. గుంటూరులోని బజరంగ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నూరు మండలం, నండూరు, చిన్న ఇటికంపాడు గ్రామాల ప్రజల కోసం నండూరు గ్రామంలో గురువారం బజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, హరిజన, గిరిజన బడుగు బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉన్న పొన్నూరు మండలం, నండూరు, చిన్న ఇటికంపాడు గ్రామాల ప్రజలకు నండూరు గ్రామం కేంద్రంగా నేత్ర జ్యోతి శిబిరాన్ని ఏర్పాటు చేయడం వెనుక జగనన్న సంక్షేమ స్ఫూర్తి దాగి ఉందన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ శిబిరం ద్వారా నేత్ర సమస్యల నుంచి గ్రామ ప్రజలందరికీ రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి వారం రోజుల్లోగా కళ్లజోళ్లను అందించడం జరుగుతుందన్నారు. తద్వారా భవిష్యత్‌లో తలెత్తే అనేక ఇబ్బందుల నుంచి తప్పించగలమని వెల్లడించారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి, ఈ సేవా పరంపర సత్ఫలితాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో అనేక గ్రామాల్లో నిర్వహించిన నేత్ర జ్యోతి శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభించిందని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 8,323 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో 6,504 మందికి కళ్లజోళ్లు అందించడం జరిగిందని వివరించారు. నండూరు, చిన్న ఇటికంపాడు పరిసర గ్రామాల ప్రజల కోసం జరుగుతున్న ఈ కార్యక్రమంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి కేవలం ఏడు పని దినాల్లోనే కళ్లజోళ్లు పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**EDUCATION**

■ AP ఓపెన్ స్కూల్ నందు డైరెక్ట్10th,ఓకే సం॥లో ఇంటర్‌లో ప్రవేశానికి ఆఖరి అవకాశం 30-10-2023. సంప్ర॥ శ్రీ సత్యసాయి కాలేజ్, 4/18, బ్రాడీపేట, గుంటూరు 9346446079

■ డిగ్రీ (BA, B.Com, BBA, B.Sc) తప్పినవారికి డైరెక్ట్‌గా డిసెంబర్-2023లో జరుగు పరీక్షల ద్వారా పూర్తి చేసుకునే అవకాశం. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి కూడా మంచి అవకాశం. 7386406839

**REAL ESTATE**

■ గుంటూరు జిల్లా గోరంట్ల, పెద్దకాకాని, అగతవరప్పాడు, వెనిగండ్ల, నంబూరు, కాజా, మంగళగిరి, నంబూరు ఏరియాలో అ.కో. డైరెక్ట్ పార్టీ.. 9032113988

■ శ్రీ భ్రమరాంబపురం కాలనీ & మల్లి భార్జునపురం కాలనీ & UDA అప్రూవ్ ప్లాట్స్ & జనచైతన్య వెంచర్‌లో ఉన్న ప్లాట్స్ అ/కో. Cell: 9848986831

**FLAT FOR SALE**

■ గుంటూరు సిటీ నగరాలు బాలాజీనగర్ 1వలైను, ID హాస్పిటల్ వెనుక, నూతనంగా నిర్మించిన వేళాంగిణి మాత ఎన్క్లేవ్ నందు 2 Bhk (1090 sft) ఉత్తరం ఫేసింగ్ 3Bhk (1493 sft) తూర్పు ఫేసింగ్ ఫ్లాట్స్ కారు పార్కింగ్‌తో సహా అమ్మక మునకు కలవు. 9701408899, 9640936327

■ గుంటూరు రాజేంద్రనగర్ 1వలైను గొట్టిపాటి కళ్యాణ మండపం రోడ్‌లోగల శ్రీలక్ష్మీ భీమేసి అపార్ట్‌మెంట్ నందు ఫ్లాట్‌నెం.301, 2BR,E/N F, 1175Sft, కారు పార్కింగ్ అమ్మబడును కలదు: 9866347789, 9440670585

■ గుంటూరు బృందావన్ గార్డెన్స్ ZUDIO షోరూం ప్రక్క వీధిలో 'రాఘవ' అపార్ట్‌మెంట్స్ ఫేజ్-2, 1stఫ్లోర్ నందు 2BHK ఫ్లాట్ నెం. 608 అమ్మకానికి కలదు. బిల్టప్ ఏరియా 640 SFT & ల్యాండ్ షేర్ 34-6 SQ యార్డ్స్ ✆ 91820 81904, 98666 82222

**LAND FOR SALE**

■ ఉత్తమూరు గ్రామం, దుగ్గి మండలంలో మెయిన్ రోడ్‌కి రెండవ బిట్టు 4 ఎకరాల 80 సెంట్లు, మెట్ట, మిర్చి యార్డుకి దగ్గర, తూర్పు ఫేస్, 40 అ॥ల దారి, ధర ఎకరాకు 33 లక్షలు, Negotiable and No Broker. సంప్ర॥ 8897194078, 8247878440

**PLOT FOR SALE**

■ గుంటూరు మున్సిపాలిటీ పరిధిలోని 66వార్డు అయిన బొంతపాడు నందు 160గ॥ నివాస గృహములకు మధ్య స్థలము తూర్పుఫేసింగ్ ఖాళీస్థలం, కరెంట్, సౌకర్యం అతో అతి తక్కువ ధరకు అమ్మబడును 9493180043

■ దసరా Spl Offer : రిజిస్ట్రేషన్ చార్జెస్ ఫ్రీ. బంద్రివనం @ అద్దంకి 22 సెంట్స్ 90 మొక్కలతో డ్రిప్ ఇరిగేషన్ సదుపాయంతో ధర కేవలం రూ.7 లక్షలు మాత్రమే. ఫోన్: 89781 62222

■ మేదరమెట్లలో 160 ఎకరాల మెగా గేటెడ్ గజం 5800, హౌస్ 33 లక్షలు. అద్దంకి దగ్గర 22 సెంట్లు 96 శ్రీగంధం, మహోగని, అవకాడో 3 సం॥ మొక్కలు 6.5 లక్షలు. ✆ 93904 51999

**TO-LET**

■ 8000/-అద్దెకు 2BHK, E/F, 301 ఫ్లాట్ లిఫ్ట్, జనరేటర్, కారు పార్కింగ్ 24గం॥ వాటర్, శ్రీసాయి టవర్స్ పాత పోస్ట్ ఆఫీస్ రోడ్డు, నల్లపాడు, గుంటూరు 8247025748

**SERVICES**

■ మీరు ఫెయిల్ అయినా / కాలిన / చిరిగినా /10th, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికేట్స్ తెప్పించబడును. సర్టిఫికేట్స్ కరెక్షన్ పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు 9849185616

■ వ్యక్తిగత వ్యవసాయ భూములకు పర్సనల్ రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు మొదలగు వారికి ఆర్థిక సలహాలు మరియు సహాయం చేయబడును. సంప్ర: 9084063557

**BUSINESS OFFER**

■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 7015828102

**BOREWELLS**

■ విజయవాడ బోర్‌వెల్స్4-1/2,6-1/2,7"&8" అంగుళం బోర్లు & ఫ్లిషింగ్ సరసమైన ధరలకు వేయబడును. హరిహరమహల్ ఎదురుగా, L.V.R క్లబ్ ప్రక్కన, గుంటూరు. 9866222717, 9848183887

**CERTIFICATE MISSING**

■ నేను, మందూరు శ్రీనివాసరావు S/o ముత్యాలు R/o రాజాపాలెం, పెదనందిపాడు (M), Guntur Dt. నాకు సంబంధించి 10th, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికేట్లు పోయినవి. ఎవ్వరికైన దొరికినచో సంప్ర॥ 8330262687

**WANTED**

■ చిలకలూరిపేటలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్ వైజర్స్ కావలెను. అ:డిగ్రీ, 12గం॥ డ్యూటీ-16000, సెక్యూరిటీ, అ:10th or ఇంటర్ 12గం॥డ్యూటీ-12000 9502087373

■ పల్నాడు జిల్లాలోని అన్ని మండలాలవారిగా గ్రామాలవారిగా నిరుద్యోగ యువతీ/యువకులు జాబ్ చేయుటకు కావలెను. జీవితంలో మంచి పొజిషన్‌లో ఉండాలి అనుకున్నవారు సంప్ర॥ 8143108727

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థనందు డోర్ టు డోర్ మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ M/Fకావలెను.అ:10th ఆపైన, వ:18-35సం॥ జీతం:12000 7569525896, 7004197266

■ ప్రముఖ యూట్యూబ్ ఛానెల్‌లో పనిచేయుటకు అనుభవం కల ఎడిటర్స్, ఫొటోషాప్ డిజైనర్స్(M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర॥ 9502895498

■ మంగళగిరి, చిలకలూరిపేట, నరసరావుపేట ప్రముఖ బ్యాంక్ నందు పనిచేయుటకు గోల్డ్‌లోన్ మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మంచిజీతం+ ఇన్సెంటివ్స్, అ: ఇంటర్/డిగ్రీ, జీ: 17-19వేలు. 8096836114

■ Wanted Male Campus incharges, Qualification Any Degree Must be married Salary Upto: 20,000/- place of work Master Minds College, Guntur. Contact: 9248733344

■ DDU-GKY ట్రైనింగ్ సెంటర్ నందు పనిచేయుటకు స్టాఫ్ కావలెను. కంప్యూటర్ ట్రైనింగ్, ఇంగ్లీష్ ట్రైనర్, వార్డెన్, టెలికాలర్స్, మొబిలైజర్, రిసెప్షనిస్ట్ M/F కావలెను 9951279786, 9676280624

■ ప్రముఖ కంపెనీ నందు పర్మినెంట్‌గా జాబ్ చేయుటకు యువతి/ యువకులు కావలెను. అ: 7th- డిగ్రీ, జీ: 15-20వేలు రూం+మీల్స్ వెంటనే జాయినింగ్. 9440817759

■ సిటీజంబో జిరాక్స్8/1 అరండల్‌పేట గుంటూరులో పనిచేయుటకు 10th/ఇంటర్ చదివిన M/F & కం॥ఆపరేటర్(M) కావలెను. గుంటూరు లోకల్ వారు మాత్రమే. సంప్ర: 94410 65559

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్న వారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓల్డ్ ఆఫీసు వర్క్. సంప్ర: 9963255441

■ సబ్ డీలర్స్ కావలెను. భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన 3 వీలర్ ఆటోకు సంబంధించి తెనాలి, రేపల్లె, బాపట్ల, నరసరావుపేట, పిడుగురాళ్ళ, మాచర్ల, మంగళగిరిలో డీలర్స్ కావలెను. 9246480889

■ గుంటూరు సిటిలో అప్పిగూడు ఆటో అమ్మబడును. వాటర్ ట్యాంక్ క్లీన్ చేసే మిషన్ అమ్మబడును. కావలసిన వారు సంప్ర॥ 9908958795, 9440263429

■ గుంటూరు పట్టణములో ఎ.టి అగ్రహారము నందు గృహములో ఉండుటకు వాచ్‌మెన్ కుటుంబముతో కావలెను. వయస్సు: 25సం॥ నుండి 50 సం॥ల లోపు ఉండవలెను. 8500482999

■ గుంటూరు సిటీలోని సంజీవి హాస్పిటల్ నందు కంప్యూటర్ ఆపరేటర్ ICU నర్సింగ్ స్టాఫ్, Emergency (ER) Team, ANM Staff, వార్డు స్టాఫ్, ఫార్మసిస్ట్ HR, ల్యాబ్ టెక్నీషియన్స్ కావలెను. జీతం + వసతి సౌకర్యం కలదు. సంప్ర॥ 9092665544

■ Wanted Female Computer Operator, Hospital Billing Experience Female B.Pharmacist /D.Pharmacist Male Nursing staff, House keeping staff. 9030213662, 6302848852

■ తాడేపల్లిలోని నులకపేట సెంటర్ దగ్గర ఉన్న మందుల కంపెనీ ఆఫీస్‌లో పనిచేయుటకు Tally తెలిసిన లేడీ కంప్యూటర్ ఆపరేటర్ & సూ॥వైజర్స్ కావలెను 8121112299, 9490129599

■ ప్రఖ్యాత డెంటల్ హాస్పిటల్ యొక్క పిడుగురాళ్ళ, చిలకలూరిపేట మరియు పొన్నూరు, జగ్గయ్యపేట బ్రాంచెస్ నందు పనిచేయుటకు BDS మరియు MDS డాక్టర్స్ కావలెను. ఆకర్షణీయమైన శాలరీ మరియు ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. వివరములకు సంప్రదించండి. Cont: 9966782031, 9966108455

■ తెనాలి లోకల్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు ఆడ/మగ కావలెను. 12 గం॥ డ్యూటీ జీతం: 12000/- అర్హత: 10th. ✆ 9666228570 / 9493648570

■ Wanted Teachers upper school, Telugu / Social / Science, Lower school Maths and early childhood, supporting staff 80195 35068 E-Mail:prasana@moriahschool.com

■ తెనాలి, చెంచుపేట, అప్పడాల కంపెనీ నందు పనిచేయుటకు స్త్రీలు కావలెను. సమయం: ఉ॥ 9గం॥ నుండి సా॥ 6గం॥ వరకు. జీతం నెలకు 10000 8502086585

■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833

■ టీమ్ లీడర్స్ కావలెను. సొంత గ్రామం, మండలాల్లో ఫోన్, ఇంటర్నెట్ ద్వారా మంచి ఆదాయం. ఇన్సెంటివ్స్ + బోనస్. వ॥ 20. టీం వర్క్. కంపెనీ డెవలప్‌మెంట్ ✆ 83418 68943

■ తెనాలిలో గల ప్రముఖ జ్యూయలరీ షాపు నందు పనిచేయుటకు సేల్స్ MEN & WOMEN కావలెను. జీతం 12వేలు+ బెనిఫిట్స్ వయస్సు 21 To 35, గ్రాడ్యుయేట్స్ కావలెను. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత. ✆ 8712692654

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926

■ ప్రముఖ పద్మ గోల్డ్ టెక్స్‌టైల్ కంపెనీలో ఏరియా వారిగా పర్మినెంట్ ఎంప్లాయిస్ (M/F) కావలెను. Salary : 44,000 + ఇన్సెంటివ్స్ Time 10 AM to 4 PM. Cont: 9494213958

■ ప్రముఖ సెక్యూరిటీ కంపెనీలో 1) అసిస్ట్ సెక్యూరిటీ ఆఫీసర్, (Ex. మ్యాన్ JCO ర్యాంక్) 2) హెడ్ గార్డ్స్ 3) సెక్యూరిటీ గార్డ్స్ జగ్గయ్యపేట, కోదాడ పరిసర ప్రాంతాలలో గల సిమెంట్స్ ప్లాంట్‌లో పని చేయడానికి కావలెను. మంచి జీతం+వసతి ఉచితం. డ్యూటీ 28 రోజులు. ఫోన్ : 9000494238, 9492939462

■ అంజన్న హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. స్త్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18000/- నుండి 25,000/-వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో, Hyd. Ph: 9966568882/ 9963489661

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97030 13015
97034 67843
92904 02000

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వవలసిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.